క్లుప్తంగా

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన అవసరం



తాతపూడిలో రోగి ఇంటి వద్ద చికిత్స చేస్తున్న వైద్యురాలు ప్రియాంక

కపిలేశ్వరపురం: వర్షాలు పడుతున్న నేపథ్యంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధుల నుంచి కాపాడుకోవచ్చని అంగర పీహెచ్‌సీ వైద్యురాలు జె.అనూజ ప్రియాంక అన్నారు. తాతపూడిలో ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా గురువారం నిర్వహించిన శిబిరంలో 102 మందికి సేవలందించారు. కదలలేని వృద్ధులు, వికలాంగుల ఇంటికి వెళ్లి చికిత్స చేశారు. శిబిరాన్ని ఎంపీటీసీ సభ్యురాలు జుత్తుక వెంకటలక్ష్మి సందర్శించారు. 104, అంగర పీహెచ్‌సీ వైద్య ఆరోగ్య సిబ్బంది సేవలందించారు.

30 మందికి కంటి పరీక్షలు



కోరుమిల్లిలో కంటి పరీక్ష చేస్తున్న కోటేశ్వరరావు

కపిలేశ్వరపురం: కోరుమిల్లి సచివాలయం-1 పరిధిలో గురువారం డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు పథకంలో భాగంగా 35 మందికి పరీక్షలను చేశారు. పారామెడికల్ ఆప్తాలమిక్ ఆఫీసర్ డి.కోటేశ్వరరావు పరీక్షలు చేసి 15 మందికి కళ్లజోళ్ళు అవసరమని గుర్తించారు. ఐదుగురుకి శస్త్ర చికిత్సలు చేయించాలని నిర్ణయించారు. శిబిరంలో వైద్య ఆరోగ్య కార్యకర్తలు సేవలందించారు.

ఘనంగా గోవృషభ కల్యాణం



ఆవు-ఆంబోతుకు కల్యాణం జరిపిస్తున్న దృశ్యం

కె.గంగవరం: మండలంలోని శివల గ్రామంలో బుధవారం గోవృషభోత్సవ కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన మార్తి గణేష్‌రావు, అర్జునాదేవి దంపతుల ఆధ్వర్యంలో వేదపండితులు ఆవు-ఆంబోతులకి కల్యాణం జరిపించారు. లోకకల్యాణార్థం ఈ గోవృషభోత్సవం నిర్వహించామని నిర్వాహకులు తెలిపారు. కల్యాణం అనంతరం వేంకటేశ్వరస్వామి వారి ఆలయం వద్ద భారీ అన్నదానం నిర్వహించారు. గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పైడితల్లి అమ్మవారికి పూజలు



ప్రత్యేక అలంకరణలో పైడితల్లి అమ్మవారు

రాయవరం: స్థానిక దుర్గాదేవి ఆలయంలో ఉన్న పైడిమాంబ అమ్మవారి వార్షికోత్సవ పూజలు గురువారం వైభవంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన కర్రా ఆదినారాయణ, విశాలాక్షి దంపతుల ఆధ్వర్యంలో నూలు సతీష్ తనూజ దంపతులు పీటలపై కూర్చుని పూజాకార్యక్రమాలు చేశారు. అనంతరం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన నిర్వహించారు. పూజల్లో ఆకాశం వీరవి జయ్‌కుమార్, ఉమాదేవి, ఎంపీపీ నవుడు వెంకటరమణ, స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.

త్వరలో నూతన అసెంబ్లీ పనులు



పుదుచ్చేరి కొత్త అసెంబ్లీ నమూనా

యానాం: అధునాతన వసతులతో పుదుచ్చేరి నూతన అసెంబ్లీ పనులు త్వరలో ప్రారంభమవుతాయని సీఎం రంగసామి తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పుదుచ్చేరి వైట్‌టౌన్ వద్ద ఉన్న ప్రస్తుత అసెంబ్లీ భవనం 87,120 చదరపు అడుగుల్లో ఉందని, దీనిని 1820లో ఫ్రెంచి ప్రభుత్వం ఆసుపత్రిగా ఉపయోగించేవారన్నారు. 1959 నుంచి పుదుచ్చేరి అసెంబ్లీ కాంప్లెక్స్‌గా చేశారన్నారు. కొత్త అసెంబ్లీ 15 ఎకరాల విస్తీర్ణంలో రూ.420 కోట్లతో చేపట్టే నిర్మాణ పనులకు త్వరలో శంకుస్థాపన జరుగుతుందన్నారు. ఈ నూతన అసెంబ్లీ కాంప్లెక్స్‌లో అసెంబ్లీతో పాటు చీఫ్ సెక్రటేరియట్ నిర్మాణం ఉంటుందన్నారు.

గిట్టుబాటయ్యేనా..!

- భారీవర్షాలకు పడిపోయిన దిగుబడి
- కూలీలకు పెరిగిన డిమాండ్
- మిగిలిన పంటను ఒబ్బిడి చేసుకుంటున్న రైతులు



ఆర్యావటంలో నీట మునిగిన పంటను కోతకోసి ఒడ్డుకు చేరుస్తున్న కూలీలు



ఆకాశంలో మేఘాలు కమ్ముకోవడంతో కాజులూరులో హడావుడిగా మాసూళ్లు చేస్తున్న కూలీలు

కాజులూరు: దాళ్వా దిగుబడి ఆశాజనకంగా ఉండటంతో కోటి ఆశలతో మాసూళ్లకు ఉపక్రమించిన రైతులను అకాల వర్షాలు నట్టేటముంచాయి. ఆవర్త ఐద్రోణి ప్రభావంతో గత ఐదు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు నియోజకవర్గంలోని రైతన్నలు కుదేలయ్యారు. వరుణుడు కరుణించి గురువారం కాస్త వాతావరణ తెరపినివ్వటంతో మిగిలిన పంటను ఒబ్బిడి చేసుకునేందుకు రైతులు సిద్ధమయ్యారు. వాతవరణ మార్పులతో అమాంతంగా పెరిగిన కూలిరేట్లు వరి రైతులను కలవరపరుస్తున్నాయి. కాజులూరు మండలంలో ఈ ఏడాది 18,076 ఎకరాల్లో రైతులు వరి సాగు చేపట్టారు. అధికారిక లెక్కల ప్రకారం ప్రస్తుతం వర్షాల సమయానికి కేవలం 3175 ఎకరాల్లో మాత్రమే రైతులు మాసూళ్లు నిర్వహించారు. మిగిలిన 14,901 ఎకరాల్లోనూ పంట కోత కోయాల్సి ఉంది. గతంలో కొందరు రైతులు కూలీలతో పంట కోతలు నిర్వహించగా కొందరు రైతులు నేల గట్టిగా ఉండే పొలాల్లో వరికోత యంత్రాల ద్వారా మాసూళ్లు నిర్వహించేవారు. అయితే గత ఐదు రోజులుగా ఈదురు గాలులతో కురిసిన వర్షాలకు వరిచేలు నేల కొరిగి, ముంపునకు గురయ్యాయి. పడిపోయిన పంట నీళ్లల్లో రోజుల తరబడి ఉండిపోవడంతో నేలనంటి మొలకలు వస్తున్నాయి. ఫలితంగా కూలీలతో తప్పనిసరిగా రైతులు కోత కోయించాల్సి వస్తోంది. దీంతో కూలీలకు అమాతంగా డిమాండ్ పెరిగి కూలి ధర ఆకాశాన్ని చేరింది. గతంలో ఎకరం పొలం కోత కోయడానికి ఆరు నుంచి ఎనిమిది మంది కూలీలు అవసరమయ్యేవారు. ప్రస్తుతం పంట ఒరిగిపోయి నేలనంటడంతో కూలీల సంఖ్య పెరిగిందని రైతులంటున్నారు. కోత కోసేందుకు 15 మంది, పంట నూర్పిళ్లు చేసేందుకు మరో ఆరుగురు కూలీలు అవసరమౌతున్నారంటున్నారు.

పెరిగిన కూలి రేట్లు

నెలనంటిన వరి పంటను కోత కోసేందుకు కూలీల సంఖ్య పెరగడంతో పాటు వాతవరణంలో మార్పుల కారణంగా కూలిరేట్లు అమాంతంగా పెరగటంతో రైతులు లబోదిబోమంటున్నారు. గురువారం వాతావరం కాస్త తెరపిచ్చినప్పటికీ మధ్యమధ్యలో ఆకాశంలో కారుమబ్బులు కమ్ముకుని రైతులను పరుగులు పెట్టించాయి. ఉన్న పంటను దక్కించుకుందామని రైతులంతా ఒక్కసారిగా కోతలు, మాసూళ్ల పనులు ప్రారంభించడంతో కూలీలకు డిమాండ్ పెరిగింది. దీంతో కూలీలు అమాతంగా ధరలు పెంచేశారు. వర్షాల సమయానికి నియోజకవర్గ గ్రామాల్లో కూలి రేట్లు రూ.500 నుంచి 600 ఉండేది. వర్షాల భయంతో రైతులంతా ఒక్కసారిగా పనులు ప్రారంభించడంతో ప్రస్తుతం కూలీలు రోజుకి రూ.800 నుంచి 1000 వరకు తీసుకుంటున్నారని రైతులు అంటున్నారు. ఈ పరిస్థితిలో పంట కోతలు కోసి నూర్పిళ్లు చేసినా మాసూళ్ల ఖర్చులు కూడా రావని కోయకుండా వదిలేద్దామంటే దాళ్వా ధాన్యం పొలాల్లో ఉండిపోయి తొలకరి పంటలో కేళీలు వస్తాయని, కోత పెట్టుబడులు కూడా రాకపోయినా కోయాల్సి వస్తోందని రైతులు పేర్కొంటున్నారు.

తడిసిన ధాన్యాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే

కపిలేశ్వరపురం: వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు గురువారం పరిశీలించారు. మండలంలోని వెదురుమూడి, అచ్యుతాపురం, కాలేరు, టేకి, పడమర ఖండ్రిక, అంగర, మాచర గ్రామాల్లో పర్యటించి, రైతులు రహదారులు, వ్యవసాయ క్షేత్రాల్లో ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలించారు. ప్రభుత్వ పరంగా వెంటనే చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే వేగుళ్ల అధికారులు వివరించారు. ఆయన వెంట డీసీఎంఎస్ మాజీ చైర్మన్ రెడ్డి ప్రసాద్, టీడీపీ నాయకులు గుడాల జయబాబు, మేడిశెట్టి వెంకటరమణ, నానిబాబు ఉన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో సమస్యలు దూరం



కుయ్యేరులో రామాలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న చెల్లుబోయిన నరేన్

కాజులూరు: ఆధ్యాత్మిక చింతనతో మనిషి మానసిక ప్రశాంతతను పొంది సమస్యలకు దూరంగా ఉండగలుగుతాడని మంత్రి వేణు తనయుడు నరేన్ అన్నారు. మండలంలోని కుయ్యేరులో నూతనంగా నిర్మిస్తున్న రామాలయానికి గురువారం నరేన్ భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి వ్యక్తి భగవంతునిపై భక్తిభావాలు కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మాతా భారతి, జెడ్పీటీసీ వనుం వెంకటసుబ్బారావు, సర్పంచ్ పిల్లి కృష్ణమూర్తి, మండల గృహసారథుల కమిటీ కన్వీనర్ చింతపల్లి నాగేంద్రప్రసాద్, రాయుడు శ్రీనివాస్ స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా విజయగణపతి విగ్రహ ప్రతిష్ఠ

రామచంద్రపురం రూరల్: మండలంలోని నరసాపురపుపేటలో నూతనంగా నిర్మించిన విజయ గణపతిస్వామి ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ఠలు గురువారం చోడవరం ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘం చైర్మన్ కొప్పిశెట్టి ఏడుకొండలు, కాకి అప్పారావు పర్యవేక్షణలో ఘనంగా నిర్వహించారు. వేదపండితులు కప్పగంతు సత్యనారాయణ శర్మ, చెరుకుపల్లి గణేష్‌శర్మ, మద్దిరాల శ్రీనివాసదత్తుల బ్రహ్మత్వంలో కొప్పిశెట్టి వీవీ సత్యనారాయణ, ఆదిలక్ష్మి, అనుసూరి నాగేంద్రం, శ్రావణి దంపతుల చేతుల మీదుగా విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా నిర్వహించే పూజాధికాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సుమారు 2 వేల మందికి అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చాట్రాది వీరలక్ష్మి, ఎంపీటీసీ పరమట జ్ఞానలక్ష్మి, ఎంపీపీ అంబటి భవాని, వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, వైఎస్సార్ సీపీ యువ నాయకులు చెల్లుబోయిన నరేన్, పిల్లి సూర్యప్రకాశ్, తోట పృధ్వీరాజ్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పంటనష్టంపై మంత్రి వేణు సమీక్ష



వ్యవసాయ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి వేణు

రామచంద్రపురం: అకాల వర్షాలకు జరిగిన పంట నష్టంపై రామచంద్రపురం నియోజకవర్గంలోని మూడు మండలాల వ్యవసాయ అధికారులతో రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ గురువారం తన క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. మండలాల వారీగా పంట నష్టంపై వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు పూర్తిస్థాయిలో న్యాయం జరిగేలా పంట నష్టం వివరాలను సమగ్రంగా రూపొందించి అందించాలని అధికారులను ఆదేశించారు. రైతులకు మరింత నష్టం జరగకుండా తగిన చర్యలను తీసుకోవాలని సూచించారు. పంట కోత పూర్తి కాకుండా వర్షానికి పడిపోయిన చోట్ల ఉపాధి కూలీల ద్వారా నీరు బయటకు తీసి, మొలకలు రాకుండా ఉప్పు ద్రావణం కలిపే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమీక్షలో ఏడీఏ ఎస్.జయరామలక్ష్మి, వ్యవసాయ అధికారులు ఎన్.సత్యప్రసాద్, బి.రవి, వి.అశోక్, రామచంద్రపురం తహసీల్దార్ పి.తేజేశ్వరరావు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



లబ్ధిదారునికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్సీ తోట, విజయభాస్కరరెడ్డి

మండపేట: అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ప్రభుత్వం అండగా నిలిచి అవసరమైన వైద్య సాయం అందిస్తోందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. అర్తమూరుకు చెందిన మండ గోవిందరెడ్డికి వైద్యం నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.5 లక్షలు చెక్కును గురువారం స్థానిక క్యాంపు కార్యాలయంలో మండల మాజీ ఉపాధ్యక్షుడు గొలుగూరి విజయభాస్కరరెడ్డితో కలిసి ఎమ్మెల్సీ తోట అందజేశారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో పేదలకు వైద్యం నిమిత్తం సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి సీఎంఆర్‌ఎఫ్ ద్వారా అవకాశం ఉన్నంత వరకు సాయం అందిస్తున్నామన్నారు. రూ.ఐదు లక్షల సాయం మంజూరుపై ఎమ్మెల్సీ తోట, విజయభాస్కరరెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యురాలు మండ సుమలత తదితరులు పాల్గొన్నారు.

14న ఏఎంసీ ప్రమాణ స్వీకారం

మండపేట: స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం ఈ నెల 14వ తేదీన జరుగనుంది. అందుకోసం ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆధ్వర్యంలో ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఏఎంసీ చైర్మన్‌గా సిరిపురపు శ్రీనివాసరావు, వైస్ చైర్మన్‌గా చిక్కాల శ్రీనివాసరావు, ఇతర సభ్యులను నియమిస్తూ ఇటీవల మార్కెటింగ్ శాఖ ఉత్తర్వులిచ్చిన విషయం విదితమే. నూతన కమిటీ ప్రమాణ స్వీకారానికి సన్నాహాలు చేస్తున్నారు. అందుకు సంబంధించి ఆహ్వాన పత్రికను గురువారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆవిష్కరించారు. 14వ తేదీ ఆదివారం సాయంత్రం ద్వారపూడి అయ్యప్పస్వామి ఆలయం పక్కన ఉన్న టీఎంసీ కల్యాణ మండపంలో జరుగనున్నట్టు ఎమ్మెల్సీ తోట తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు. రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాజుబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



సిబ్బందితో మాట్లాడుతున్న పీడీ ఎస్.మధుసూదన్

రాయవరం: మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను డ్వామా పీడీ ఎస్.మధుసూదన్ పరిశీలించారు. మండలంలో పలు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కళ్లాల్లో నీరు నిలువ ఉండకుండా పంట బోదెలు, కాలువలు, డ్రైన్లు పూడికతీత పనులకు ప్రాధాన్యమిస్తున్నట్టు చెప్పారు. పొలాల్లో ధాన్యం ఉంటే వాటిని ఉపాధి హామీ కూలీలతో గట్లపైకి తరలించేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఇదిలా ఉండగా మండల పరిధిలో 252 మంది కూలీలతో వ్యవసాయ క్షేత్రాల్లో ఉన్న వర్షపు నీరు బయటకు తరలించే పనులు చేపట్టామని, 598 మంది కూలీలతో తుప్పలు తొలగించే పనులను చేయించినట్టు పీడీకి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నౌడు వెంకటరమణ, ఎంపీడీఓ డి.శ్రీనివాస్, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ సుధారాణి, జేఈ ఎం.ఈశ్వరరావు పాల్గొన్నారు.

వైభవోపేతం.. సోమేశ్వరుని రథోత్సవం



స్వామివారి రథోత్సవాన్ని నిర్వహిస్తున్న భక్తులు

రాయవరం: సోమేశ్వరంలో ఉన్న బాల త్రిపురసుందరి సమేత సోమేశ్వర స్వామివారి వార్షిక కల్యాణాన్ని పురస్కరించుకుని గురువారం స్వామి అమ్మవార్ల రథోత్సవం వైభవోపేతంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు పరిటాల సుబ్రహ్మణ్యశర్మ అర్చకత్వంలో స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సవ మూర్తులను రథంపై ఆశీనులు చేసి రథోత్సవం నిర్వహించారు. ఈఓ ఎస్.అయ్యప్పరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ గంరగ వెంకటేశ్వరరావు, సర్పంచ్ ఎన్.ఆరీఫ్, సహకార సంఘం చైర్మన్ ఎన్.వీర్రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ధైర్యం చెప్పాలి

- అధికారులను ఆదేశించిన జేసీ ధ్యానచంద్ర



అన్నదాతల పరిస్థితిపై అధికారులను అడిగి తెలుసుకుంటున్న జేసీ ధ్యానచంద్ర

రాయవరం: అకాల వర్షంతో ఆందోళన చెందుతున్న అన్నదాతలకు అండగా ఉండి ధైర్యం చెప్పాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. గురువారం రామచంద్రపురం వెళుతున్న జేసీ మార్గమధ్యలో మాచవరం మెయిన్ రోడ్డు వద్ద ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులను కలిశారు. ఈ సందర్భంగా వర్షాల కారణంగా మండలంలో పంట నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని, సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టం అంచనాలను రూపొందించాలని ఆదేశించారు. తేమ శాతం నిమిత్తం లేకుండా ధాన్యాన్ని రైస్ మిల్లర్లు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నౌడు వెంకటరమణ, ఆర్డీఓ సింధు సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ కేజే ప్రకాష్‌బాబు, ఎంపీడీఓ డి.శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారి కె.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

రామచంద్రపురం: పట్టణంలోని 33/11 కేవీ సబ్ స్టేషన్ ఫీడర్-2పై మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాకు రేపు శనివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఏఈ మేడిశెట్టి వెంకటరమణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దాట్ల శ్రీధర్ వర్మ ఆదేశాల మేరకు తహసీల్దార్ కార్యాలయం, కృత్తివెంటి పేర్రాజు పంతులు విద్యాసంస్థల ప్రాంతం, చప్పిడివారి సావరం, బ్రాడీపేట, మెయిన్ రోడ్డు, ముచ్చుమిల్లి రోడ్డు, ఆదర్శ ఆసుపత్రి రోడ్డు, గాంధీపేట, రత్నంపేట, లలితానగర్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు కలుగుతున్న అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

ముగిసిన 'సంపూర్ణ శ్రీమద్రామాయణం' ప్రవచనం

కొత్తపేట: వివిధ హిందూ పురాణాలు వినడంతో కష్టాలు తొలగి, శాంతి, జ్ఞానం, మోక్షం కలుగుతాయని ప్రముఖ ప్రవచన కర్త, వేద పండితుడు బ్రహ్మశ్రీ దెందులూరి సర్వేశ్వరసీతారామశర్మ తెలిపారు. స్థానిక హరిహర దేవాలయ ప్రాంగణంలో ఉమాకొప్పులింగేశ్వర పురాణ ప్రవచన కమిటీ ఆధ్వర్యంలో మార్చి 23 నుంచి ఈ నెల 3 వరకూ 42 రోజుల పాటు ×సంపూర్ణ శ్రీమద్రామాయణం పురాణ ప్రవచనం× కార్యక్రమం నిర్వహించారు. రోజూ సాయంత్రం 6 నుంచి రాత్రి 8.30 గంటల వరకూ మండలంలోని పలివెలకి చెందిన ప్రవచనకర్త సీతారామశర్మ రామాయణ ప్రవచనాలు కళ్లకు కట్టినట్టు వినిపించారు. ఇలా ప్రతి రోజూ ఆయన రెండున్నర గంటల సేపు పురాణ ప్రవచనాలతో భక్తులను భక్తిపారవశ్యంలో ముంచెత్తారు.

వైభవంగా సీతారామ కల్యాణం

పురాణ ప్రవచనం ముగింపు సందర్భంగా బుధవారం రాత్రి స్థానిక పాతరామాలయం నుంచి సీతారాముల ఉత్సవమూర్తులను మేళతాళాలతో ఊరేగింపుగా హరిహరదేవాలయ ప్రాంగణానికి తీసుకువచ్చి, సీతారామశర్మ పర్యవేక్షణలో పురాణ ప్రవచన కమిటీ కన్వీనర్ సలాది రామమోహనరావు-నాగకవిత దంపతులతో రాజమహేంద్రవరానికి చెందిన వేదపండితులు సీతారామ కళ్యాణం వైభవంగా నిర్వహించారు. అనంతరం సీతారామశర్మ, 'శ్రీరామచంద్రమూర్తి పట్టాభిషేకం' ఘట్టాన్ని వివరించి రామాయణ పురాణం ముగించారు. పురాణ ప్రవచనాలు ముగింపు సీతారామశర్మ దంపతులను, పండితులను ప్రవచన కమిటీ తరఫున సలాది రామమోహనరావు (చిన్ని) దంపతులు పూలమాలలు, నూతన వస్త్రాలతో సత్కరించారు.

'దాసరి'కి భారతరత్న ఇవ్వాలి



దాసరికి నివాళులర్పిస్తున్న కామన తదితరులు

మండపేట: సినీ, రాజకీయ, పత్రికా రంగాల్లో ఎన్నో సేవలందించిన దర్శకరత్న దివంగత డాక్టర్ దాసరి నారాయణరావుకు భారతరత్న బిరుదు ప్రదానం చేయాలని డీఎన్ఆర్ ట్రస్ట్ భవన్ మేనేజింగ్ ట్రస్టీ కామన ప్రభాకరరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దాసరి 76వ జయంతిని ఏడిద డీఎన్ఆర్ భవన్‌లో గురువారం ఘనంగా జరిగాయి. దాసరి చిత్రపటానికి కామన తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రజాప్రతినిధిగా, సినీ దర్శకుడిగా పేదల అభ్యున్నతికి, కళారంగానికి దాసరి సత్యనారాయణ చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ట్రస్టు సభ్యులు పాడిశెట్టి సత్యనారాయణ, గంధ్రోతుల రామచంద్రరావు, తాడి సత్యనారాయణరెడ్డి, కాటూరి అమ్మినీడుచౌదరి, మేకా జగగ్గురు, జువ్వల ఆదినారాయణ, వాసిరెడ్డి బాబూరావు, ముగ్గుళ్ల శ్రీను, జొన్నాడ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధానికి వ్యాపారులు సహకరించాలి



ప్లాస్టిక్ నిషేధంపై రూపొందించిన కరపత్రాన్ని ఆవిష్కరించిన మున్సిపల్ కమిషనర్ ద్విజ్‌గోయల్

యానాం: పట్టణంలో ప్లాస్టిక్ నిషేధానికి వ్యాపారులు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ ద్విజ్‌గోయల్ పేర్కొన్నారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బ్రాందీ షాపులు, రెస్టారెంట్ల యజమానులతో పాటు తోపుడుబండ్ల వ్యాపారులతో ప్లాస్టిక్ నిషేధంపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇకపై ప్లాస్టిక్ కవర్లు వాడే వ్యాపారులపై జరిమానా విధిస్తామని హెచ్చరించారు. అయితే యానాం వర్తక సంఘం అధ్యక్షుడు నల్లా వెంకన్న మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేధానికి జూన్ 5 వరకు గడువు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలపై రూపొందించిన కరపత్రాన్ని మున్సిపల్ కమిషనర్ గోయల్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ మేడిశెట్టి రామలింగమూర్తి, వ్యాపారులు గాజుల బ్రహ్మానందం(బాబి), నల్లం నాగబాబు, గోపాలకృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ

కె.గంగవరం: మండలంలోని భట్లపాలిక శివారు దరువుపేట గ్రామానికి చెందిన బత్తుల లక్ష్మణుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ నేపథ్యంలో గురువారం వారి కుటుంబాన్ని జనసేన నాయకులు పోలిశెట్టి చంద్రశేఖర్ పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం వారికి డొక్కా సీతమ్మ ఆసరా పథకం ద్వారా పోలిశెట్టి లక్ష్మీ సుబ్బారావు చారిటబుల్ ఫౌండేషన్ తరఫున బియ్యం, కూరగాయలతో పాటు నిత్యావసరాలు పంపిణీ చేశారు.

రైతులకు అండగా ప్రభుత్వం

- ఆందోళన చెందాల్సిన అవసరం లేదు
- ఎమ్మెల్సీ తోట

మండపేట: తమది రైతు ప్రభుత్వమని, విపత్తు సమయంలో అన్నదాతలను అన్ని విధాలా ఆదుకోవడంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుంటారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తెలిపారు. అకాల వర్షాల కారణంగా మండపేట నియోజకవర్గంలో పంటకు వాటిల్లిన నష్టం గురించి గురువారం సాయంత్రం కలెక్టర్ హిమాన్షుశుక్లాతో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మాట్లాడారు. తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు సత్వర చర్యలు తీసుకోవాలని కోరారు. అధిక శాతం విస్తీర్ణంలో ఎంటీయూ 1121 రకంను రైతులు సాగు చేశారని, ప్రభుత్వం నిర్ణయించిన మేరకు 75 కేజీల బస్తా రూ.1530 కొనుగోలు చేయాలని కోరారు. అనంతరం ఎమ్మెల్సీ తోట మీడియాతో మాట్లాడుతూ పంట చేతికందే సమయంలో అకాల వర్షాలు రైతుల వెన్ను విరుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం వైఎస్ జగన్ రైతు పక్షపాతి అని, అన్నదాతలకు అన్నివిధాల తమ ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

రైతులు అధైర్యపడొద్దు.. ప్రతి గింజా కొంటాం

ఇన్‌చార్జ్ ఆర్డీఓ జె.సీతారామారావు



చొల్లంగిలో వర్షాలకు తడిసిన వరి పనలను పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ ఆర్డీఓ సీతారామారావు

తాళ్లరేవు: రబీ సీజన్‌కు సంబంధించి ధాన్యం ప్రతి గింజా కొంటామని, రైతులు అధైర్యపడొద్దని ఇన్‌చార్జ్ ఆర్డీఓ జె.సీతారామారావు అన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో ముంపు నీటిబారిన పడిన పంటపొలాలను గురువారం ఆయన స్వయంగా పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. చొల్లంగి గ్రామంలో పర్యటించి ధాన్యం నమూనాలను పరిశీలించి సస్యరక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండి పంట నష్ట నివారణ చర్యలు చేపట్టాలన్నారు. పంట నష్ట నివారణకు సంబంధించి అన్ని సలహాలు, సూచనలు రైతులకు ఎప్పటికప్పుడు తెలియజేయాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. అధిక వర్షాల వల్ల దెబ్బతిన్న ధాన్యాన్ని తప్పనిసరిగా కొనుగోలు చేస్తామని, దీనికి రైతు భరోసా కేంద్రాలు వినియోగించుకోవాలన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు గోనెసంచులు అందించనున్నట్లు తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ ఎస్.పోతురాజు, ఎంపీడీఓ ఎం.అనుపమ, ఆర్డీఓ కార్యాలయ పరిపాలనాధికారి వరహాలయ్య, రెవెన్యూ, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.